క్లుప్తంగా

ఘనంగా వనమహోత్సవం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సీతారాళ్ల గుట్ట సమీపంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. పద్మశాలీలు కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం శివుడికి అభిషేకాలు చేశారు. మహిళలు బతుకమ్మలు ఆడారు. వనమహోత్సవానికి గుర్తుగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కిషోర్, సత్యనారాయణ, సుధాకర్, రమేష్, రమేష్, శ్రీనివాసులు, సైదులు, వెంకట్ పాల్గొన్నారు.

టై, బెల్టులు పంపిణీ

కల్వకుర్తి రూరల్: ముకురాల గ్రామానికి చెందిన కొప్పుల జై వర్ధన్ రెడ్డి సమకూర్చిన టై, బెల్ట్‌లను మండలంలోని పంజుగుల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు గణేష్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎల్లయ్యగౌడ్, రామేశ్వరయ్య, ఆంజనేయులు, శివకుమార్, కార్యదర్శి కృష్ణ, బాలరాజు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: వనితా క్లబ్ నాగర్‌కర్నూల్ అధ్యక్షురాలు లలిత, సాయికృష్ణ దంపతులు సమకూర్చిన టై, బెల్టులు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. శ్రీనివాసులు, ప్రసాద్, చంద్రశేఖర్, హెచ్‌ఎం రమేష్, పాల్గొన్నారు.


వీధి కుక్కలను నియంత్రించాలి

కొల్లాపూర్: పట్టణంలో వీధి కుక్కలను నియంత్రించాలని బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా శ్రీనివాస్ అధికారులను కోరారు. 6వ వార్డులో రెండు రోజుల కిందట కుక్కకాటుకు గురైన చిన్నారులు ఫైజాన్, శ్వేతలను ఆయన పరామర్శించారు. వీధి కుక్కల నియంత్రణలో మున్సిపల్ అధికారులు విఫలం అయ్యారన్నారు. అధికారులు స్పందించకుంటే పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిరసన

కోడేరు: మండల కేంద్రంలోని కోడేరు, పస్పుల వెళ్లే ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం వాగు దగ్గర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ కొన్నేళ్లుగా పస్పుల వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి పస్పుల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రవి, కాటం లక్ష్మయ్య పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



కోడేరు: శాంతిభద్రత పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కొల్లాపూర్ సీఐ మహేష్, ఎస్‌ఐ జగదీశ్వర్, శ్రీనివాస్, వెంకటేష్, ఉస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం గ్రామీణ ప్రాంత స్వయం సహాయక మహిళ గ్రూపులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని సంకల్పంతో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ ప్రీనియర్ ఆఫ్ ఇండియా ప్రపంచ బ్యాంకు నిధులతో భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ర్యాంప్‌లో భాగంగా ఉత్పత్తుల మార్కెటింగ్ మెలుకువలు, నైపుణ్యంపై శిక్షణ ఇచ్చారు. బ్యాంకుల ద్వారా శిక్షణ పొందిన మహిళలకు రుణ సహాయం అందించనున్నట్లు డీఐసీ జనరల్ మేనేజర్ సచిన్ తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహేందర్, కృష్ణయ్య, ఖాసిం, శ్యామ్, చంద్రయ్య, శ్రీదేవి, ప్రభాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో ఎల్లమ్మ బోనాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సురేందర్ రెడ్డి, శ్రీను, సత్యనారాయణ, కృష్ణయ్య, ఈదమయ్య గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

కొల్లాపూర్: మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను జీవీకే ఈఎంఆర్‌ఐ జిల్లా మేనేజర్ బి.శ్రీను మంగళవారం తనిఖీ చేశారు. అంబులెన్స్ నిర్వహణ, రోగుల తరలింపు, మందుల వినియోగం వంటి అంశాలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో అంబులెన్స్ ఈఎంటీ మధు, పైలెట్ నరసింహస్వామి ఉన్నారు.

పొంగిన వాగులు, నిండిన చెరువులు

- నిలిచిన రాకపోకలు
- పరిశీలించిన అధికారులు



పాలెం పెంటోని చెరువు అలుగును పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు



కోడేరు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పస్పుల వాగు

కోడేరు: మండలంలో నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. నీటి ఉధృతి పెరగడంతో బావాయిపల్లి, దేవల్‌తిర్మలాపూర్, పెద్దకొత్తపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనాలు, బస్సులు నడవకపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. కోడేరు, పస్పుల, పెద్దకొత్తపల్లి, ఖానాపూర్, గంట్రావుపల్లి, వెళ్లేందుకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్‌ఐ జగదీశ్వర్ ముళ్ల కంచెలను ఏర్పాటు చేసి పోలీసు సిబ్బందిని అక్కడే ఉంచారు. రోజు రోజుకు నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో ప్రజలు ఇక్కడికి రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వర్షం నీరు నిలిచింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అలుగుపారిన పాలెం పెంటోని చెరువు

బిజినేపల్లి: జిల్లా వ్యాప్తంగా జోరుగు కురుస్తున్న వర్షాలతో మండలంలోని ఆయా చెరువులు కుంటలు పొంగిపొర్లుతున్నాయి. పాలెం పెంటోని చెరువు నిండి అలుగు పారుతోంది. పాలెం పెంటోని చెరువు తూం, అలుగు, కట్టను నీటి పారుదల శాఖ సీఈ విజయభాస్కర్‌రెడ్డి, అధికారులు పరిశీలించారు. ఎస్‌ఈ పార్థసారథి, డీఈ వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

గొర్రెలను కాపాడిన యువత



పెద్దకొత్తపల్లి: మండలంలోని వెన్నచెర్ల వాగు వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. వనపర్తి జిల్లా చందాపూర్ గ్రామానికి చెందిన కుర్వ రామచంద్రయ్యకు సంబంధించిన గొర్రెలను మేత కోసం తీసుకొచ్చాడు. వెన్నచర్ల పెద్ద చెరువు వాగు దాటించే క్రమంలో దాదాపుగా 100 గొర్రెలు వాగులో కొట్టుకపోతుండగా గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు లక్ష్మీకాంతం, గ్రామ యువకులు వంగూరి తిరుపతయ్య, మీదిగేరి రాములు, దేవరాజు, బైనీ రవి, ఆత్మకూర్ చెన్నయ్య, ఎండీ మహమూద్ కాపాడారు. గొర్రెల కాపరి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సిర్సవాడ కాజ్‌వే పరిశీలన

తాడూరు: మండలంలోని సిర్సవాడ దగ్గర కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న పారుతున్న దుందుభీ నదిని మంగళవారం తహసీల్దార్ జయంతి, ఎంపీడీఓ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ మహమూద్ అలీ, పోలీసు సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుందుభీ నది ఉధృతంగా పారుతోందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పారుతున్న నదికి ఇరువైపుల బారికేడ్లను ఏర్పాటు చేసి, కంపను ఉంచారు.



తాడూరులో కాజ్‌వేను పరిశీలిస్తున్న అధికారులు

రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు

తెలకపల్లి: రైతులకు ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో ఎరువుల గోదాంను ఆయన సందర్శించారు. ఎరువుల విక్రయాల సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతులు అవసరానికి ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందికి హెచ్చరించారు. దుకాణం ఎదుట ఎరువుల మందుల నిల్వలు, రైతులకు సరైన ధరలకు అందించాలని, నాణ్యమైన ఎరువులు అందించాలని సూచించారు. రికార్డులో పేర్కొన్న ఎరువులు అందుబాటులో ఉన్నాయ లేదా పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారు, సింగిల్ విండో సీఈఓ దర్మవీర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. పీహెచ్‌సీని, కమ్యూనిటి హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌పేషెంట్, మహిళా వార్డు, ల్యాబ్ తదితర వాటిని పరిశీలించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జాకిర్ అలీ, డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

త్వరలో కోల్డ్ స్టోరేజ్ గోదాం ఏర్పాటు

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలోని రైతులకు సౌకర్యార్థంగా త్వరలో 25 ఎకరాల్లో కోల్డ్ స్టోరేజీ గోదాంను ఏర్పాటు చేయనున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో మాట్లాడారు. మండలంలోని పులిజాల శివారులో రూ. 20 కోట్ల వ్యయంతో 25 ఎకరాల్లో కోల్డ్ స్టోరీజీ గోదాంను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. గోదాం ఏర్పాటైతే స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మద్దిమడుగు వద్ద కృష్ణానదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కారీని కలిసి విన్నవించామన్నారు. త్వరలోనే సర్వేకు ఆదేశిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు. బ్రిడ్జి ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. బ్రిడ్జి ఏర్పాటైతే రెండు రాష్ట్రాల ప్రజలకు రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. వ్యాపారపరంగా లాభం చేకూరుతుందని వివరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

కోడేరు: నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తుండగా వారిని పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అడిగితే అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

గణితం నిత్యజీవితంలో ఒక భాగం

కల్వకుర్తి రూరల్: గణితం నిత్యజీవితంలో ఒక భాగమని హెచ్‌ఎం వెంకటరమణ అన్నారు. మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వాసుదేవరావు ఆధ్వర్యంలో గణిత సాధన, సులభ మెళకువలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. గణితానికి సంబంధించిన అనేక విషయాలను విద్యార్థులకు వివరించారు. వర్క్ బుక్స్ పంపిణీ చేశారు. గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, ఆనంద్ కుమార్ రెడ్డి, శ్యామలాదేవి, జైపాల్, నరసింహ, గోపాల్, నారాయణ గౌడ్, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



తాడూరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఆంజనేయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకుడు కాశన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని దళితవాడలలోని మురికి కాల్వలు, పైపులైన్ మరమ్మతు యుద్ధ ప్రాతిపాదికన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, మన్నెం చంద్రయ్య, రాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ఉప్పునుంతల: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. ఆయా తరగతుల్లో విద్యార్థుల అభ్యసన ప్రక్రియను పరిశీలించారు. గణితంలోని చతుర్విద ప్రక్రియలను చేయించారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్, చందన, సంగీతలు ఉన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు



సాక్షి, నెట్‌వర్క్: హైదరాబాద్‌లోని పెద్దమ్మ తల్లి గుడి కూల్చివేత నిరసిస్తూ హిందూ సంఘాల పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్ వెళ్తున్న బీజేపీ నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో తెలకపల్లి, లింగాల, వెల్దండ మండలాల అధ్యక్షులు చిన్నారెడ్డి, గువ్వని నవీన్, యాదగిరి, అమ్రాబాద్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, తిమ్మాజిపేటలో దాచేపల్లి వేణుగోపాల్, ప్రవీణ్‌కుమార్, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వలస కూలీని ప్రభుత్వం ఆదుకోవాలి

తెలకపల్లి: గట్టురాయపాకుల- గట్టు నెల్లికుదురు గ్రామాల మధ్యలో ఉన్న వాగులో కొట్టుకుపోయి మృతిచెందిన ఉత్తరప్రదేశ్ బలియా జిల్లాకు చెందిన వలస కూలీని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నాయకులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సూర్యశంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. తోటి కార్మికుడు మనోజ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు.

పాత టెండర్ విధానాన్ని కొనసాగించాలి

కందనూలు: గురుకుల పాఠశాలల్లో ఫుడ్ సరఫరా చేయుటకు పాత టెండర్ విధానాన్ని కొనసాగించాలని స్వేరోస్ నాయకులు కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. స్వేరోస్ ఫీట్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి విష్ణు యాదవ్, శివశంకర్, రాము, పాదాల రాము, తదితరులు పాల్గొన్నారు.

నానోపై రైతులకు అవగాహన

లింగాల: ప్రస్తుతం పంటల ఎదుగుదలకు ఉపయోగించే యూరియాకు ప్రత్యామ్నాయంగా ద్రవ రూపంలో ఉన్న నానోను వినియోగించవచ్చని మండల వ్యవసాయాధికారి అనిల్ అన్నారు. మంగళవారం పీఏసీఎస్ ఆవరణలో రైతులకు నానోపై అవగాహన కల్పించారు. పంటలకు నత్రజని అందించడానికి ఉపయోగించే ద్రవ పదార్థమని ఏఓ సూచించారు. తక్కువ మోతాదులో ఎక్కువ ఫలితం ఇస్తుందన్నారు. ఇందులో నత్రజని లభ్యత 80 శాతం మేరకు ఉంటుందన్నారు. నానో యూరియా బాటిల్ 500 మి.లీ ఒక ఎకరాకు ఉపయోగించవచ్చని, 48 కిలోల బస్తాకు సమానమని ఆయన తెలిపారు. ధాన్యపు పంటలైన వరి, మొక్కజొన్న, జొన్న మొదలగు పంటలకు వాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, పాల్గొన్నారు.

వాహనాల వేలం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో మంగళవారం 9 వాహనాలకు వేలం పాట నిర్వహించారు. వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.71,900 ఆదాయం లభించిందని సీఐ జిల్లెల వెంకటరెడ్డి తెలిపారు. 16 వాహనాలను వేలంలో ఉంచగా 9 వాహనాలకు మాత్రమే వేలంలో పోటీపడ్డారని ఆయన తెలిపారు.

కాల్వ పనులను నాణ్యతగా చేపట్టాలి

వెల్దండ: మండలంలో తెగిన డి-82 కాల్వ పనులను మంగళవారం కేఎల్‌ఐ సీఈ విజయ్ భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి ఎత్తిపోథల పథకం ద్వారా చివరి ఆయకట్టు డి-82 కాల్వ ద్వారా రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. దాదాపుగా 20 ఏళ్లకు పైగా రైతులు సాగునీరు కోసం ఎదురుచూస్తున్నట్లు ఆయన వివరించారు. కాల్వలకు మరమ్మతు చేసి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది పంటలకు డి-82కాల్వల ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెల్దండలో తెగిన కాల్వ నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ప్రార్థసారథి, ఈఈ శ్రీకాంత్, డీఈఈలు దేవన్న, బుచ్చిబాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



తెగిన కేఎల్‌ఐ కాల్వలను పరిశీలిస్తున్న సీఈ విజయ్‌భాస్కర్‌రెడ్డి

కేసరి సముద్రం చెరువుకు ఎమ్మెల్యే పూజలు

నాగర్‌కర్నూల్: ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతోంది. ఈ సందర్భంగా మంగళవారం బతుకమ్మ ఘాట్ వద్ద ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు, మత్స్యకారులకు మేలు చేకూరుతుందని అన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థి ఎంపిక

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి టి.శేఖర్ డిస్కస్ త్రోలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం మంగళవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో డిస్కస్ త్రోలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఆగస్టు 30, 31వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని వారు వివరించారు. ఎంపికైన విద్యార్థి శేఖర్‌ను పీడీ బాలు, ఉపాధ్యాయులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం జెడ్పీహెచ్‌ఎస్ 2007- 2008 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 17 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో సంబుర పడ్డారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సన్మానించారు.

గొర్రెల కాపరి అదృశ్యం: కేసు నమోదు

పెంట్లవెల్లి: గొర్రెల కాపరి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రామన్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం సింగవరం గ్రామానికి చెందిన కర్ణికం మల్లయ్య(27) సోమవారం రాత్రి గ్రామానికి సమీపంలోని వ్యవసాయ పొలంలో గొర్రెల మంద వద్ద అక్క కుమారుడితో కలిసి రాత్రి వేళ కాపలా ఉన్నారు. అర్ధరాత్రి తర్వాత మల్లయ్య కన్పించకపోవడంతో ఆందోళన చెందాడు. పక్కనే ఫోన్, చెప్పులు ఉండడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కర్ణిక మల్లయ్య భార్య మానస అదే గ్రామానికి చెందిన బన్నీల రాముడుపై అనుమానం ఉందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలి

తాడూరు: రైతులు అవసరం మేరకు యూరియాను కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు కోరారు. మంగళవారం కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం ఆవరణలో యూరియా కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అంతటా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని దీంతో యూరియా దొరకదని రైతులు భావించి అధికసంఖ్యలో తరలివస్తున్నారని వివరించారు. యూరియా కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట ఏడీఏ పూర్ణచంద్రరెడ్డి, ఏఓ సందీప్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి గొప్పది

తిమ్మాజిపేట: భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని ఏబీవీపీ ఎస్‌ఎఫ్‌డీసీ జిల్లా కన్వీనర్ శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ నిర్వహించారు. పాఠశాల, కళాశాలల ఆవరణలో రక్షాబంధన్ వేడుకలు ఏర్పాటు చేశారు. ఒకరికొకరు రాఖీ కట్టుకున్నారు. పండుగ విశిష్టతను వివరించారు. ఏబీవీపీ మండల కన్వీనర్ వెంకటేష్, నాయకులు శ్రీను శివ, లోకేష్, శివ, సత్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన ఆయూబ్ మృతిచెందడంతో మంగళవారం బాధిత కుటుంబానికి రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ బాలస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు ఆజీమ్, ఆరీఫ్, దాసరాజు, సాయి ఉన్నారు.

జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి

కొల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివవర్మ డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం చేపట్టిన గాంధీభవన్ ముట్టడి నేపథ్యంలో శివవర్మను కొల్లాపూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు. నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. శాంతియుత నిరసనలు చేపడితే అరెస్టులు చేయడం తగదన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

తెలకపల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్సీ భవనంలో హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 20న మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో టీఎల్‌ఎం మేళా నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అన్ని పాఠశాలల నుంచి 1 నుంచి 5వ తరగతి వరకు తెలుగు, గణిత, ఇంగ్లీష్, పరిసరాల విజ్ఞానం, 4 పాఠ్యాంశాల నుంచి విద్యార్థులు తయారు చేసిన టీఎల్‌ఎం తీసుకురావాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మవిగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించనున్న పోచమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. డీజేతో పాటు కోలాటాలు, భజనలు చేస్తూ పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ఉత్సవ ఊరేగింపు కొనసాగింది. మాజీ మున్సిపల్ చైర్మన్లు శ్రీశైలం, ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, సత్యవేణి పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవునితిర్మలాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు 37 మందికి మాజీ సర్పంచ్ సత్యం మంజూరు పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకుంటే త్వరగా బిల్లులు విడతలు వారీగా అందుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు, ఆంజనేయులు, బాలస్వామి, వెంకటయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తరలిన ఆదివాసీ చెంచులు

మన్ననూర్: అచ్చంపేట పట్టణంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలకు నల్లమల ప్రాంతం ఉమ్మడి అమ్రాబాద్ మండలం నుంచి ఆదివాసీ చెంచులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా చెంచు సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు దాసరి నాగయ్య, దాసరి శ్రీనివాసులుతో పాటూ కన్నెమోని శంకరయ్య, రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే ఆదివాసీ చెంచులకు సరైన న్యాయం చేకూరుతుందన్నారు. చెంచుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు.


ఘనంగా ఏచూరి జయంతి



కొల్లాపూర్: సీపీఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతి వేడుకలను మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఏచూరి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఆయన ఆశయాల సాధనకు పోరాడుదామన్నారు. కార్యక్రమంలో నాయకులు శివవర్మ, సలీం, నర్సింహ, సంజు, రాముడు, సత్యనారాయణ, గోపాల్ ఉన్నారు.

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు, ఏపీ మల్లయ్య, సురేష్, జగన్, చంద్రయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



తిమ్మాజిపేట: మండల కేంద్రానికి చెందిన యువకుడు మేహరాజ్ ఆత్మహత్య చేసుకోవడంతో మంగళవారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ఇంటికి వచ్చిన గౌస్‌ను పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గోపిగౌడ్, ఎంపీటీసీల సంఘం మాజీ అధ్యక్షుడు కిల్లె మల్లయ్య ఉన్నారు.